తండాకు బస్సు వచ్చేదెన్నడో!

- మండలంలోని గిరిజనుల అవస్థలు
- రవాణా సౌకర్యంలేక వైద్యం, విద్యకు తిప్పలే



కాలినడకన చింతకుంట పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



రాజారాం తండాకు ఏర్పాటు చేసిన తారు రోడ్డు

కథలాపూర్: ఊరికి దూరంగా ఉన్న తండాలను సమగ్రాభివృద్ధి చేస్తామని ఎన్నికలప్పుడు నేతలు ప్రసంగాలు అదరగొట్టిన... ఆచరణలో అంతం తమాత్రంగానే ఉందని గిరిజనులు వాపోతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న తమకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తండాల్లో అభివృద్ధి ఏమోగానీ.. నేటికి తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామాల నుంచి తండాలకు రోడ్డు సౌకర్యం ఉన్న బస్సుసౌకర్యం ఏళ్ల తరబడిగా కల్పించకపోవడం దారుణమంటున్నారు గిరిజనులు.

ఐదు గిరిజన తండాలు...

కథలాపూర్ మండలంలో ఐదు గిరిజన తండాలున్నాయి. చింతకుంట గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో తండాను 'రాజారాం తండా' గ్రామపంచాయతీగా ఏర్పాటుచేశారు. పోతారం గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు తండాలు, ఇప్పపెల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో తండా, అంబారిపేట గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో తండా, కలిగోట గ్రామానికి కిలోమీటర్ దూరంలో తండాలున్నాయి. ఈ తండాల్లో నివసించే ప్రజలు ప్రతీ పనికి గ్రామాలకు రావాల్సిందే. గ్రామాలకు దూరంగా ఉన్న తమకు వసతులు కల్పించడంలో వివక్షచూపుతున్నారని గిరిజనులు తెలిపారు.

– తండాలవైపు చూడని ఆర్టీసీ బస్సు..

కథలాపూర్ మండలంలోని చింతకుంట గ్రామం నుంచి రాజారాం తండాకు తారురోడ్డు ఉంది. కానీ బస్సు సౌకర్యం లేదు. పోతారం, ఇప్పపెల్లి, అంబారిపేట తండాలకు గ్రామాల నుంచి మట్టిరోడ్లు ఉన్నప్పటికీ ఆ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. తండావాసులు అనారోగ్యం పాలైన... బంధువుల ఇళ్లకు వెళ్లాలనుకుంటే బైకులు, ఆటోల్లో వెళ్లడమే దిక్కు. కొన్ని సందర్భాల్లో కాలినడకన తండా నుంచి గ్రామాలకు చేరుకొని అక్కడి నుంచి బస్సెక్కి గమ్యం చేరుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. గిరిజన తండాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ అక్కడ ప్రాథమిక విద్యవరకే పరిమితం. ఆరోతరగతి చదవాలంటే గ్రామాలకు వెళ్లడమే శరణ్యం. రవాణా సౌకర్యం లేకపోవడంతో బాలికలు ఉన్నత చదువులపై దృష్టిసారించడం లేదని గిరిజనులు పేర్కొంటున్నారు. అబ్బాయిలు ఉన్నత చదువులకు కాలినడకన సమీప గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్తున్నారు. మరికొందరు సైకిల్‌పై పాఠశాలకు చేరుకుంటున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

పంచాయతీలుగా మార్చేదెప్పుడో



తండాలను పంచాయతీలుగా మార్చుతామని ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. మండలంలో ఐదు తండాలకు గాను ఒక్క రాజరాం తండానే పంచాయతీగా ఏర్పాటుచేశారు. గ్రామాలకు అనుబంధంగా ఉన్న తండాలకు మట్టి రోడ్డు సౌకర్యం ఉంది. తండావాసులు అనారోగ్యం పాలైతే ప్రైవేట్ వాహనాల్లో ఆసుపత్రులకు వెళ్తున్నారు. అన్ని గ్రామాల మాదిరిగా తండాలకు బస్సుసౌకర్యం కల్పించాలి. తండాల అభివృద్ధిపై ప్రభుత్వాలు ఆలోచించాలి.

– తిరుపతినాయక్, గిరిజన సంఘం నేత

ఆధునిక కాలంలోనూ అవస్థలే



తండాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థుల చదువులు మధ్యలోనే మానేస్తున్నారు. తండా వాసులు నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయాలంటే కిలోమీటర్ల దూరం నడిచివెళ్తున్నారు. తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తే కనీసం తండావాసుల్లో ఆనందం ఉంటుంది. తండాలకు రోడ్డు సౌకర్యం ఉంది. ప్రభుత్వం తండావాసుల గురించి ఆలోచించి రవాణా సౌకర్యం కల్పించాలి. గిరిజన తండాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి.

– భుక్యా తిరుపతి, మండల ఎస్టీసెల్ నేత

రూట్ సర్వే చేయిస్తాం



కోరుట్ల నుంచి కథలాపూర్ మండలంలోని గిరిజన తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే విషయంలో అధికారులతో రూట్ సర్వే చేయిస్తాం. అధికారులు పరిశీలించాక నివేదికలను బట్టి తగు చర్యలు తీసుకుంటాం. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రసన్న లక్ష్మి, ఆర్టీసీ కోరుట్ల డీఎం.

‘ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి’



చిత్రవేణిగూడెం శివారుల్లో నిల్వచేసిన ఇసుక డంపు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెం గ్రామశివారుల్లో వందలాది ఇసుకను ట్రిప్పుల అక్రమంగా నిల్వచేశారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువకుడు వెల్మ మహిపాల్‌రెడ్డి సోమవారం బీర్‌పూర్ తహసీల్దార్‌కు సోషల్‌మీడియా ద్వారా ఫిర్యాదు చేశాడు. గోదావరి ఒడ్డున చిత్రవేణిగూడెం గ్రామశివారుల్లో ఇసుక పెద్ద మొత్తంలో నిల్వచేశారన్నాడు. దీనిపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామంలోని 5 చోట్ల ఇసుక నిల్వచేశారని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నాడు. ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని ఇందుకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీలతను కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వాగులో నుంచి కోరుట్ల పట్టణానికి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని తహసీల్ కార్యాలయానికి తరలించామన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 5వేలు జరిమానా విధించామని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

- మన ఊరు మన బడి పథకాలతో పాఠశాలల అభివృద్ధి
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వంమన ఊరు మనబడి ద్వారా అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం సంగంపల్లి, చల్‌గల్, తాటిపల్లి గ్రామాల్లోని మన ఊరు మనబడి కార్యక్రమం అభివృద్ధి పనులను ప్రారంభించారు. హబ్సీపూర్‌లో రూ. 15లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణానికి గౌడ, పద్మశాలీ మున్నూరుకాపు, మాల మాదిగ కులసంఘం భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. చల్‌గల్‌లో రూ.46 లక్షలతో, తాటిపల్లిలో రూ.46 లక్షలతో మన ఊరు మనబడి పనులకు శంకుస్థాపన చేశారు. తాటిపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు అనంతరం సోమన్‌పల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు డాక్టర్ రవితో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 30మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, సర్పంచులు రాజేశ్వర్‌రెడ్డి, మమత, గనర్సు, రత్నమాల, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈవో గాయత్రి పాల్గొన్నారు.

చిత్రపటం అందజేత...

జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లికి చెందిన గుగ్గిళ్ల వెంకటేశ్ వడ్రంగి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రాన్ని కలపపై ముద్రించి గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు బహుమతిగా అందించారు.

వసతిగృహం విద్యార్థులకు క్రీడాపోటీలు...

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహం విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సేవా సంస్థ వార్షికోత్సవం

కోరుట్ల: పట్టణంలోని స్వేచ్ఛా సాహిత్య సామాజిక సేవాసంస్థ 7వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు కవి, రచయిత రాసభూమయ్య సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రధానకార్యదర్శి వొటారికారి శ్రీనివాస్, చెన్నా విశ్వనాథం, పెద్ద దేవయ్య, రేగుల భూమానందం, సుతారి రాములు పాల్గొన్నారు.

కస్తూరిబా స్కూల్‌కు టీవీ బహూకరణ

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు శివారులోని కస్తూరిబాగాంధీ పాఠశాలకు ఐలాపూర్‌కు చెందిన బింగిసారం శ్రీకాంత్ సోమవారం టీవీని బహూకరించారు. ఇక ముందు కూడా పాఠశాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను సర్పంచ్ వనతడుపుల అంజయ్య అభినందించారు. ఎస్‌ఓ సుమలత, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటా భగవద్గీత పంపిణీ

జగిత్యాలరూరల్: త్రైత సిద్ధాంతం హిందు జ్ఞాన వేదిక ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి, రఘురాములకోట, అర్పపల్లి గ్రామాల్లో ఇంటింటా భగవద్గీత పంపిణీచేశారు. సేవాసమితి కొడిమ్యాల మండల అధ్యక్షుడు రాకేశ్, అంజనేయులు, వేణు, నాగేశ్వర్‌రావు, విక్రమ్, దీక్షిత్, ఆకాశ్, భీంరావు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే అనాథ పిల్లల అరిగోస కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అనాథ పిల్లల కోసం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బలవంతుల సురేశ్, కాశవతుల లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

పొలాస ఆలయ ముఖద్వారం ముస్తాబు

జగిత్యాలరూరల్: మహాశివరాత్రి జాతర సందర్భంగా శ్రీపొలాస్తేశ్వరస్వామి ఆలయం ముస్తాబు చేస్తున్నామని ఆలయచైర్మన్ కొండాల్‌రావు అన్నారు. సోమవారం చైర్మన్ కొండాల్‌రావు సహకారంతో రూ.4 లక్షలతో నిర్మిస్తున్న ముఖద్వారానికి ముస్తాబు పనులు ప్రారంభించారు. శివరాత్రి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వడ్డెరకాలనీలో ‘కంటివెలుగు’ ప్రారంభం

రాయికల్: మండలంలోని వడ్డెరకాలనీలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకమ్మ ప్రారంభించారు. గ్రామస్తులు కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, కార్యదర్శి దివ్యజ్యోతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన



ఒబులాపూర్‌లో ప్రతిజ్ఞచేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మల్యాల: కుష్ఠువ్యాధి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని అవగాహనతోనే పూర్తిస్థాయిలో నియంత్రణ సాధ్యమని మల్యాల మండల వైద్యులు డాక్టర్ రవిశంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఒబులాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞచేయించారు. కుష్ఠువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చన్నారు. సర్పంచ్ పొన్నం సరోజన మల్లేశం, సూపర్‌వైజర్ సునంద, హెచ్‌ఈవో జగదీశ్వర్, స్టాఫ్‌నర్సులు రూప, పర్వీన్, ఫార్మాసిస్ట్ సరిత పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో కుష్ఠువ్యాధి నివారణపై వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేపట్టారు. వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర, రమేశ్, హెచ్‌ఈవో శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పదోన్నతుల జాబితాలోని తప్పులు సవరించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల జాబితాలోని తప్పులు సవరించాలని సోమవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు డీఈవో జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీల ప్రక్రియలో భాగంగా మల్టీజోన్ 1లో స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్యానల్‌గ్రేడ్ పదోన్నతుల జాబితాలో నెలకొన్న తప్పిదాలను సవరిస్తూ నూతన జాబితాను జారీచేయాలన్నారు. లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు లింగారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కొడిమ్యాల: అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేలా చూడాలని కొడిమ్యాల మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు చెల్లించాలని, ఆరోగ్య లక్ష్మి పథకం బిల్లులు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు డబుల్ సిలిండర్, ఇవ్వాలని, పనికి తగిన వేతనం, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కేంద్రప్రభుత్వం పెంచిన వేతనాన్ని అందించేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, విజయలక్ష్మి, హసీనా, సుజాత, కాంతమ్మ, మమత, పద్మ వసంత, సుమలత, వినోద పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన



ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జీపీ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సర్పంచు సున్నం నవ్యశ్రీ ప్రారంభించారు. వైద్యశిబిరంలో 306 మంది కంటి పరీక్షలు చేయగా 80మందికి అపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించి మొదటి విడతగా 40 మందిని ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. మిగితా 40 మందిని 2వ విడతలో ఆపరేషన్ నిమిత్తం రేకుర్తికి పంపించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో మెట్‌పల్లి డివిజన్ లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ కొట గంగజీవన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి, కరీంనగర్ రేకుర్తి నేత్ర వైద్యులు ప్రభాకర్, యామాపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, ఉప సర్పంచు అనతి పెద్దరాజం, లయన్స్‌క్లబ్ ప్రధానకార్యదర్శి అలిశెట్టి మోహన్, కోశాధికారి ముత్యంరెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేశ్, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

రాయికల్: పట్టణంలోని 8వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి పంపిణీ చేసే పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ అన్వరి బేగం అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మిట్టపల్లి పద్మ పాల్గొన్నారు.

రాయికల్ వాసులకు సేవారత్న పురస్కారం

రాయికల్: సామాజిక రంగంలో సేవలందించినందుకు రాయికల్‌కు చెందిన గంగాధరి సురేశ్, బత్తిని నాగరాజు, కొత్తపేటకు చెందిన కల్లెం శ్రీనివాస్, రామాజీపేటకు చెందిన మాణిక్యం గంగాధర్ సోమవారం సిద్దిపేటలో యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ఫూర్తి సేవారత్న పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని యువజన సంఘం సభ్యులు అభినందించారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు సమస్య తెలుపుతున్న సర్పంచ్ రమేశ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి గ్రామపంచాయతీలో ప్రస్తుతం నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సర్పంచ్ సీపతి రమేశ్ సోమవారం కలెక్టర్ రవికి ప్రజావాణిలో దరఖాస్తు అందించారు. గతంలో కోమన్‌పల్లిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూనిర్వాసితులైన 676 కుటుంబాలకు వ్యవసాయ భూములతో పాటు, ఇళ్ల స్థలాలను కేటాయించగా ఇళ్లస్థలాలు, వ్యవసాయ భూములను భూనిర్వాసితులు అమ్ముకుని వెళ్లిపోయారన్నారు. 30 ఏళ్లుగా కోమన్‌పల్లి గ్రామస్తులు ఆ ఇళ్లస్థలాల్లో నివాసిన్నారని వారికి పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ వెల్లడించారు.

ఉచిత పశువైద్య శిబిరం



మందులు అందిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

కొడిమ్యాల: మండలంలోని శ్రీరాములపల్లిలో మల్యాల మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలుచేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్యాల మార్కెట్‌కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, రైతు సమన్వయ సమితి జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్, బండపల్లి అంజన్‌కుమార్, రైతు సమన్వయసమితి మండల అధ్యక్షుడు అంకం రాజేశం, కొండగట్టు ఆలయ డైరెక్టర్ ఉల్లాల లింగాగౌడ్, తిర్మలాపూర్ ఎంపీటీసీ సభ్యులు బాసనవేణి మహేష్, అప్పారావుపేట సర్పంచ్ గరికంటి మల్లేశం, మండల పశు వైద్యాధికారి పల్లె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందులు పంపిణీ



కలుపు మందు అందిస్తున్న వ్యవసాయాధికారులు

రాయికల్: మండలంలోని కుర్మపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సోమవారం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొక్కజొన్న కలుపుల యాజమాన్యం, నీటియాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కలుపు మందులను రైతులకు పంపిణీచేశారు. డాక్టర్ మధుకర్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఏఈవో రాజేశ్, సర్పంచ్ సుమలత పాల్గొన్నారు.

‘మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులో అక్రమాలపై విచారణ జరపాలి’

మెట్‌పల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్టులో అక్రమాలు జరుగుతున్నాయని, వీటిపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సహకారసంఘం డైరెక్టర్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్ అక్రమాలపై ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌మకరంద్‌కు ఫిర్యాదుచేశామన్నారు అంగన్‌వాడీ సెంటర్లకు ఇవ్వాల్సిన సరుకులను పంపిణీ చేయకుండా సీడీపీఓ, సూపర్‌వైజర్లతో పాటు ఇతర సిబ్బంది బయట అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. రూ.కోట్లల్లో అవినీతి జరుగుతోందని, దీనిపై జిల్లా పీడీకి ఫిర్యాదు చేస్తే ఆయన పట్టించుకోవడం లేదన్నారు. ఈ వ్యవహారంలో ఆయన ప్రమేయం కూడా ఉందన్నారు. వీటిన్నంటిని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన విచారణకు ఆదేశించారన్నారు.

ఎండీసీ ఏర్పాటుచేస్తాం

బుగ్గారం: మండలంలోని ప్రజాసమస్యలపై పోరాటం చేయడానికి త్వరలోనే మండల అభివృద్ధి కమిటీని ఏర్పాటుచేస్తామని ఆర్టీఐ కార్యకర్త, మాన వ హక్కుల సంఘం నాయకుడు చుక్క గంగారెడ్డి తెలిపారు. బుగ్గారం నూతన మండలంగా ఏర్పాటైనప్పటికీ ఆశించిన అభివృద్ధి జరగడం లేదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన కలగానే మిగిలిందన్నారు. మండలకేంద్రం అభివృద్ధిలో వెనుకబడిందని ఈ నేపథ్యంలో మండలంలోని సమస్యలపై పోరాటం చేయడానికి ఎండీసీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో అన్ని వర్గాల వారిని, అన్నిపార్టీల వారిని, అన్నిసంఘాల నాయకులను సభ్యులుగా చేర్చుకుంటామన్నారు. రాజకీయాలకతీతంగా, మండలాభివృద్ధే ధ్యేయంగా ఎండీసీ పనిచేస్తుందన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

జగిత్యాల: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బాలికల సబ్‌జూనియర్ విభాగంలో జగిత్యాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పర్ణిక బేత్ బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈసందర్భంగా కోచ్ గంగారావు అభినందించారు.

ఆర్టీసీ సమస్యలపై సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 5న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా ఆల్‌ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా సీఐటీయూ కోకన్వీనర్ ముదుగం రాజలింగం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరబోని శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి సీఎంజీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



సమావేశానికి హాజరైన వీఆర్‌ఏలు

జగిత్యాలరూరల్: అర్హత గల వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని వీఆర్‌ఏల జేఏసీ చైర్మన్ ద్యాగల గంగారాం అన్నారు. సోమవారం జగిత్యాల వీఆర్‌ఏల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 6న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వీఆర్‌ఏలకు పేస్కేల్, వయస్సు పైబడిన వారసులకు ఉద్యోగ అర్హత గల వీఆర్‌ఏలకు పదోన్నతులు, జీవోలు అమలుచేసి పద్దు కేటాయించాలన్నారు. లేనియెడల వీఆర్‌ఏలు మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. జేఏసీ కో–చైర్మన్ సుంకం తిరుపతి, జనరల్ సెక్రటరీ తుమ్మల నాగరాజు, కన్వీనర్ శంకర్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల/మెట్‌పల్లి: కోరుట్ల పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్ఠాన్‌లోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుతారి రాములు, అందె రామయ్య, రాడం అశోక్, షికారి గంగాధర్, రాచకొండ పెద్ద దేవయ్య, పొశెట్టి టీపీసీసీ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, పట్టణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, మండలాధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అందె భవిత రాణి, చెన్నూరి నిర్మల నాయకులు బెజ్జారపు శ్రీనివాస్, అందె మారుతి, షకీల్, శివకుమార్, చైతన్య, రవి, గంగాధర్ తదితరులున్నారు.

‘హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి’

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం ముస్కు స్రవంతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి తండ్రి రాజగోపాల్ సోమవారం ఎంఈవో గంగాధర్‌కు ఫిర్యాదుచేశారు. తన కొడుకు ప్రియాన్ష్ ప్రభుత్వపాఠశాలలో యూకేజీ చదువుతుండగా ఈనెల 23న పాఠశాలలో కుడిచేయి విరిగిపోవడంతో విద్యార్థులపై పర్యవేక్షణ లేదని హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఇష్టానుసారంగా మాట్లాడారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మన ఊరు మన బడికి బెంచీలు మంజూరు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో మన ఊరు మన బడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు మంజూరు కాగా సోమవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంఈవో గంగాధర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో దశల వారీగా మౌలిక వసతుల కలపనకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి స్వప్న, విద్యాకమిటీ చైర్మన్ రాజేందర్, హెచ్‌ఎం సత్యనారాయణ, డీఈఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.